


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 26-3-2025

సంపుటి: 20 సంచిక: 308
పేజీలు: 8 వెల: రూ.1

• ఎడిటోరియల్

## వెలుగు దివిటీలతో మేం సిద్ధం!

*నాస్తి సత్యాత్పరో ధర్మః నాస్తి సత్యాత్పరం తపః !*
*నాస్తి సత్యాత్పరం జ్ఞానం తస్మాత్ సత్యం సమాచరేత్ !!*

సత్యం కంటే గొప్ప ధర్మం లేదు. సత్యం కంటే గొప్ప తపస్సు లేదు.. సత్యం కంటే గొప్ప జ్ఞానం లేదు. కాబట్టి సత్యాన్ని ఆచరించాలి.

సరిగ్గా ఇరవై ఏళ్ల కిందట రవి అస్తమించే వేళ.. సిక్కోలు నుదుట వెలుగు తిలకాన్ని అద్దడానికి ఉదయించింది సత్యం సాయంకాల దినపత్రిక. గోధూళి వేళ, సూరీడి ప్రభ తగ్గుతున్న సమయాన... సత్యం ఉదయిస్తుంది. వార్తల కాంతుల్ని పంచుతుంది. అక్రమార్కుల చీకటి బతుకుల్ని ఎండగడుతుంది. రెండు దశాబ్దాల కిందట మొదలైన ఈ పరుగు అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. ఈ ఇరవై ఏళ్లలో సత్యం పేరు జిల్లా వాసులకు చిరపరిచితమైపోయింది. నిజాయితీ, నిబద్ధత, జనం సమస్యల పరిష్కారమే అజెండాగా నడుస్తున్న పత్రిక సత్యం ఒక్కటే అని సగర్వంగా చెప్పగలం. కరోనా మహమ్మారి సమయంలో కూడా నిరంతరాయంగా కొనసాగిన ఒకేఒక స్థానిక పత్రిక సత్యం.

మాకు ఏ నాయకుడూ శత్రువు కాదు. ఎవ్వరూ మిత్రుడు కాదు. ప్రకటనల మీదే ఆధారపడి ఉన్నా కూడా, ఆర్థిక ప్రయోజనాల కోసం ఎవ్వరినీ తలకెత్తుకోలేదు. కిందకు దించలేదు. ఈ ఇరవై ఏళ్లలో కేవలం మీ అభిమానాలే కాదు.. చాలా బెదిరింపులు కూడా వెనకేసుకున్నాం. అట్రాసిటీ కేసులు, పరువునష్టం కేసులు, అత్యాచారం కేసులు, చివరకు మా కార్యాలయం మీద భౌతిక దాడులు, మమ్మల్ని నిర్మూలిస్తామనే వార్నింగులూ... వీటికి మేం బెంబేలెత్తిపోలేదు. రౌడీయిజం మీద వార్తలు రాస్తే, మమ్మల్ని అంతు చూస్తామన్నారు. ఇప్పటికీ మేం అక్రమాలను ప్రశ్నిస్తూనే ఉన్నాం. ఇదీ.. సత్యం అంటే. బహుశా ఈ జిల్లాలో మా మీద ఉన్నన్ని కేసులు మరో పత్రికకు లేవనే భావిస్తున్నాం.

ఆరంభించిన నాటినుంచి రాష్ట్రంలో జరిగిన రాజకీయ వ్యవహారాలను పూర్తిగా నిష్పాక్షికంగా, పారదర్శకంగా అందించిన పత్రిక సత్యం మాత్రమే. 2014, 2019, 2024 ఎన్నికల్లో మా అంచనాలకు తగ్గట్లుగానే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా సత్యానిది ఎప్పుడూ ప్రతిపక్షమే, ప్రజాపక్షమే.

ఇప్పటికీ అద్దె కార్యాలయంలోనే బతుకీడుస్తున్న మధ్యతరగతి పత్రిక సత్యం. జర్నలిజం అంటే వ్యాపారం కాదని మా నమ్మకం. సత్యం బతకడానికి మాత్రమే మాకు ప్రకటనలు కావాలి. కానీ ప్రకటనల కోసం సత్యం కాదు. మా నిబద్ధతనీ, జనంలో మాకున్న ఆదరణనీ నమ్మినవాళ్లు ప్రకటన రూపంలో మాకు ఆక్సిజన్ అందించి, సహకరించిన వారందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు. పత్రికగా మీ నిబద్ధతను తప్పుపట్టలేం.. కానీ ప్రకటనలంటే ఇవ్వలేం.. మీకిస్తే వందమంది మా మీద సవారీ చేస్తున్నారంటూ ప్రకటనకర్తల వేదనను అర్థం చేసుకోగలం. కాకపోతే సత్యంకు ప్రకటనలు తప్ప మరో ఆదాయ మార్గం లేదు. అయినా అన్ని కష్టాలను, నష్టాలను భరించి ముందుకు సాగుతున్నాం. భవిష్యత్తులో ఎన్నాళ్లు నడుపుతామో తెలీదు గానీ.. ప్రస్తుతానికి ఒక స్థానిక పత్రిక, అదీ శ్రీకాకుళం లాంటి ప్రాంతంలో 20 ఏళ్లు నడపడం, దానికి పాఠకులు అగ్రతాంబూలం ఇవ్వడం కచ్చితంగా పాఠకులు, ప్రకటనకర్తల ప్రోత్సాహమే. సోషల్‌మీడియా విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రింట్ మీడియా నడపడమే ఓ సాహసం. దీనికి తోడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అక్కడ ఏ మేరకు విధ్వంసం సృష్టించిందో తెలీదు గానీ ఇక్కడ మాత్రం న్యూస్‌ప్రింట్ అందని పరిస్థితి. అయినా సిక్కోలు కోసం, ఇక్కడి పాఠకుల కోసం ఈ అసిధారా వ్రతాన్ని చేస్తునే ఉన్నాం.. చేస్తుంటాం.. అందుకు మీ సహకారం మాకు ప్రాణసమానం.

ప్రపంచాన్ని మార్చడమే ఇప్పటికీ మీ ఆయుధం అయితే, పాత్రికేయమే అత్యవసర, స్వల్పకాలిక ఆయుధం అన్నాడు బ్రిటన్ సాహితీవేత్త టామ్ స్టాపర్డ్. మేం సత్యం పత్రికనే ఆయుధంగా మలుచుకున్నాం. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తూనే ఉన్నాం. జనానికి సత్యాన్ని తెలియజేస్తూనే ఉంటాం. ఇక మార్పు అనేది సమాజం, వ్యవస్థల చేతుల్లో ఉంది. సందె చీకట్లు అలుముకుంటున్న వేళ సత్య కాంతుల్ని పంచడానికి వెలుగు దివిటీలతో మేం సదా సిద్ధంగా ఉంటాం. సదా, సర్వదా, శతథా, సహస్రదా సిక్కోలు సంక్షేమానికి పునరంకితమవుతాం.



# డామిట్.. కాపీ కథ ఎదురు తన్నిందే!

- ❖ అసలుకే ఎసరు తెచ్చిన డీఈవో ఓవర్ యాక్షన్
- ❖ తన వెనుక లోపాలు కప్పిపుచ్చి డాంబికాలు
- ❖ ఏకోన్ముఖంగా ఎదురుతిరిగిన ఉపాధ్యాయ లోకం
- ❖ మంత్రి, కలెక్టర్ జిల్లాకు రాగానే చర్యలు
- ❖ రిటైర్మెంటుకు ముందే అయ్యగారి పోస్టుకు ఎసరు?



ప్రచారం కోసం చేసిన ఓవర్ యాక్షన్ చుట్టూతిరిగి తన పీకకే చుట్టుకుంటుందని బహుశా ఆయన ఊహించి ఉండరు. కానీ ఇప్పుడదే జరిగేలా కనిపిస్తోంది. కుప్పిలి జిల్లాపరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు చూసిరాతలకు పాల్పడుతున్నారన్న ఆరోపణతో 14 మంది ఉపాధ్యాయులను, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసిన వివాదం ఇప్పుడు అటు తిరిగి ఇటు తిరిగి డీఈవో కార్యాలయానికి, తిరుమల చైతన్య మెడకు చుట్టుకున్నట్టు కనిపిస్తోంది.



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డీఈవో హోదాలోనే జులైలో రిటైర్ కావాలని తిరుమల చైతన్య భావిస్తుంటే.. ఇప్పుడు ఆ సీటుకే ఎసరొచ్చింది. 14 మందిని ఏకాఎకిన సస్పెండ్ చేసి, వారిలో సగం మందిపై క్రిమినల్ కేసులు పెట్టి రాష్ట్రంలో తనంత నిజాయితీపరుడు, ముక్కుసూటి మనిషి మరొకరు లేరని నిరూపించుకునే తాపత్రయంతో దుందుడుకుగా వ్యవహరించి జిల్లా ప్రతిష్టనే తాకట్టు పెట్టిన తిరుమల చైతన్యను డీఈవో పదవి నుంచి తప్పిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. తిరుమలచైతన్య కావాలా? ఉపాధ్యాయ వర్గాలు, విద్యార్థుల తల్లిదండ్రులు కావాలా? తేల్చుకోవాలని కోరుతున్నాయి.

### ఉపాధ్యాయ వర్గాల తీవ్ర ఒత్తిడి

జిల్లాకు వేరొకరు డీఈవోగా వస్తే తనంత సమర్థవంతంగా పని చేయలేరని, దాని వల్ల జిల్లాకు చెడ్డపేరు వస్తుందని, అలాగే పదో తరగతి ఫలితాల శాతం కూడా తగ్గిపోతుందని మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద సొంత డప్పు కొట్టుకొని ఇన్‌ఛార్జి డీఈవో పోస్టులో రిటైరయ్యే వరకు తానే ఉండేలా గట్టిచేసుకున్న తిరుమల చైతన్య కోరి కొరివితో తల గోక్కున్నారు. తన ఓవరాక్షన్‌తో పదవీ విరమణకు ముందు ఆ హోదా కోల్పోయే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లు విజయవాడలో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఉన్నందున సస్పెన్షన్ల వ్యవహారంపై రెండు రోజులుగా కదలిక కనిపించలేదు. ఉపాధ్యాయ సంఘాల కార్యాచరణలో భాగంగా మంగళవారం సాయంత్రం నగరంలో నిర్వహించిన ర్యాలీ కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమైంది. పార్టీలు, అనుబంధాలకు అతీతంగా అన్ని ఉపాధ్యాయ సంఘాలు, జిల్లాలో ఉన్న అందరు ఉపాధ్యాయులు, కుప్పిలి పరిసర గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని డీఈవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రితో పాటు జిల్లా మంత్రి కూడా రెండు రోజులుగా కలెక్టర్ల

- మిగతా లోపలి పేజీలో



# డామిట్.. కాపీ కథ ఎదురు తన్నిందే!



(మొదటి పేజీ తరువాయి)

కాన్ఫరెన్స్ వల్ల దీని మీద దృష్టి సారించలేకపోయారు. మంగళ వారం సాయంత్రం టీచర్లు చేపట్టిన నిరసన జిల్లా మొత్తం మీద ఒక కదలి తీసుకువచ్చింది. కలెక్టర్ జిల్లాలోకి రాగానే చర్యలుంటాయని తెలుస్తోంది. ముందుగా సస్పెన్షన్, క్రిమినల్ చర్యలకు గురైన ఉపాధ్యాయుల విషయంలో కలెక్టర్ పాజిటివ్‌గా నిర్ణయం తీసుకుంటారని భోగట్టా. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చుక్క పగడాలమ్మను డీఈవోగా తేవాలని స్వయంగా మంత్రి అచ్చెన్నాయుడే భావించారు. కానీ అప్పటికే ఇన్‌ఛార్జిగా ఉన్న తిరుమల చైతన్య మంత్రిని ఎలా బుట్టలో వేశారో తెలీదుగానీ పగడాలమ్మ రాకుండా అడ్డుకొని తానే కొనసాగుతూ వచ్చారు. అయితే పగడాలమ్మ కూడా ఈ ఏడాది జూన్‌లో రిటైర్ కానున్నారు. తిరుమల చైతన్యను పదవీ విరమణకు ఒక్కరోజు ముందైనా డీఈవో పదవి నుంచి తప్పించాలని ఉపాధ్యాయ సంఘాలు పట్టుపడుతున్నాయి. అదే సమయంలో పగడాలమ్మను ఇక్కడకు తేవాలని, ఎలాగూ జూన్‌లో రిటైర్ అయిపోతున్నారు కాబట్టి, ఆ తర్వాత కూటమి ప్రభుత్వం ఎవర్ని కావాలంటే వారిని డీఈవోగా నియమించుకోవచ్చన్న సందేశాన్ని ఉపాధ్యాయ సంఘాలు పంపుతున్నాయి.

### డీఈవో కార్యాలయమే అక్రమాల కేంద్రం

అసలు జిల్లాలో చూసిరాతలు జరిగినా, మాస్‌కాపీయింగ్ అని పేరు పెట్టినా, డీఈవో పరిభాషలో చెప్పాలంటే మాల్‌ప్రాక్టీస్ అని పేర్కొన్నా.. వాటన్నింటికీ కర్త, కర్మ, క్రియ డీఈవో కార్యాలయమే. జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో 50 శాతం ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను క్విడ్ ప్రో కో పద్ధతిలోనే నియమించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు ఆమదాలవలస హైస్కూల్ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను శ్రీకాకుళంలో ఒక పరీక్ష కేంద్రానికి ఇన్విజిలేటర్లుగా నియమిస్తే, అదే శ్రీకాకుళంలోని పాఠశాల నుంచి ఆమదాలవలస హైస్కూల్ కేంద్రానికి ఇద్దరు ఇన్విజిలేటర్లను నియమించారు. అంటే.. 'మా స్కూల్ నుంచి వచ్చిన విద్యార్థులను మీరు చూసుకోండి, మీ స్కూల్ నుంచి వచ్చిన విద్యార్థులకు మేం రాయిస్తాం' అన్న పద్ధతిలో డీఈవో కార్యాలయమే నియమించింది. ఇటువంటి ఆరోపణలకు సమాధానం చెప్పాల్సింది డీఈవో తిరుమల చైతన్యే. ఇప్పుడు వాటిని వదిలేసి చిన్నపాటి చూసిరాతల కేసును మాల్‌ప్రాక్టీస్ పేరుతో మసి పూసి మారేడుకాయ చేసి సస్పెన్షన్లు, క్రిమినల్ కేసులను పెట్టడం వేస్ట్.





మండలంలోని కేశవరావుపేట గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం అంగన్వాడీ కార్యకర్త లకు పోషన్ బి, పడాయి బి పై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఒక్క అంగన్వాడి కార్యకర్త పోషకాహార పదార్థాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చేలా చూడాలని ఐసీడీఎస్ పీవో డోల పాపినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఎచ్చెర్ల

### వైద్య, ఆరోగ్య నైపుణ్యాలు, అవకాశాలపై అవగాహన సదస్సు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆరోగ్య రంగంలో నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలపై రాగోలులోని జెమ్స్ హాస్పిటల్‌లో వచ్చేనెల 3న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కిమ్స్ గ్రూప్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు విచ్చేస్తారన్నారు. డిగ్రీ చదివిన విద్యార్థులకు వైద్య, ఆరోగ్య రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలపై ఈ సదస్సులో వివరిస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు గూగుల్ లింక్ లో https://docs.google.com/forms/d/1IHpR_CUGXSkzLbnSG7F9LUIoAbHLNXV-aWL9D_1jhlw/viewform?edit_requested=true తమ పేర్లు ఏప్రిల్ 2లోగా నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లలో సంప్రదించాలన్నారు.

# విలువల గల నేత అచ్చెన్నాయుడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- ఆత్మీయుల మధ్య పుట్టిన రోజు వేడుకలు
- వివిధ దేవాలయాలు మందిరాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు
- ఆశీర్వచనం చేసిన వేదపండితులు
- రాష్ట్ర నలుమూల నుంచి తరలివచ్చిన అభిమానులు, నాయకులు
- శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి, మంత్రులు

రాష్ట్ర రాజకీయాలలో విలువలు గల నేతగా గుర్తింపు పొందిన నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అని పలువురు వక్తలు కొనియాడారు. ఈ మేరకు బుధవారం ఆయన జన్మదిన వేడుకలవేళ శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో మంగళవారం అర్ధరాత్రి ఆయన జీవన సహచరి విజయ మాధవితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆత్మీయులంతా ఆయనకు ఫోన్లలో శుభాకాంక్షలు తెలిపి ఆనందం పంచుకున్నారు. ఏటా మాదిరిగా ఈ పండుగ కూడా తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కింజరాపు కుటుంబాన్ని ఎప్పటినుంచో ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో ప్రోత్సహించిన వైనం ఎప్పటికీ చిరస్మరణీయమన్నారు. రాష్ట్ర ప్రజలకు మేలుచేసే విధంగా పనిచేయడం తనకెంతో ఆనందాలను ఇస్తున్నాయని చెప్పారు. రాజకీయంగా సామాజికంగా తన ఎదుగుదలకు సహకరించిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మేలు మరువనన్నారు. అలానే కూటమి ప్రభుత్వంలో భాగమవుతున్న ప్రతి ఒక్క నాయకుడికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగానికి ఊతం ఇచ్చే నిర్ణయాలు తీసుకుని వాటిని అమలు పరిచే దిశలో తనకు ఎంతో సహకరిస్తున్న వారికి ధన్యవాదాలు చెప్పారు. కాగా అచ్చెన్నాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని శ్రీకాకుళం మొదలుకొని రాష్ట్ర నలుమూలలు నుంచి వచ్చిన ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రత్యేక పూజలు నిర్వహించిన అభిమానులు

శ్రీకాకుళం నుంచి విజయవాడ వరకూ వివిధ దేవాయాలలో ఆయన అభిమానులు ప్రత్యేక పూజలు చేయించారు నగరంలో జామియా మసీదులో ఆయన పుట్టినరోజు వేడుకలు జరిగాయి. కూటమి నేతల నేతృత్వాన ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆయనకు ఆయురారోగ్యాలూ, అష్టైశ్వర్యాలూ దక్కాలని కోరుతూ ఈ ప్రార్థనలు సాగాయి. రాష్ట్రాభివృద్ధిలో చిరస్మరణీయరీతిలో ఆయన భాగం కావాలని కోరారు. అభిమానులు మధ్య 70 కేజీల కేక్‌ను ఆయన కట్ చేశారు. అదే విధంగా వేదపండితులు కూడా ఆశీర్వదించారు.


### తరలి వచ్చిన అభిమానులు, నాయకులు, అధికారులు

ఈ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి నాయకులు, రాష్ట్రమంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌తోపాటు పలువురు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.







# చిన్న సినిమా రెండు పెద్ద రికార్డ్‌లు




నాని హీరోగా వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు. హీరోగా ఎంత బిజీగా ఉన్నా నిర్మాతగా తన అభిరుచికి తగ్గ సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నాడు. విభిన్న కథలతో పాటు, మంచి మెసేజ్‌ను జనాలకు ఇవ్వాలనే ఉద్దేశంతోలో బడ్జెట్ సినిమాలు, మీడియం బడ్జెట్ సినిమాలను నిర్మించడం లేదా, తన వంతు సహకారంను అందించడం చేస్తూ వస్తున్నాడు. తాజాగా 'కోర్ట్' సినిమాను నాని ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చాడు. రామ్ జగదీష్ దర్శకత్వంలో దీప్తి గంటా, ప్రశాంతి తిర్పినేని నిర్మించిన ఈ సినిమాను నాని సమర్పించాడు. సినిమా కథపై నమ్మకంతో, దర్శకుడు తీసిన విధానం నచ్చడంతో ప్రమోషన్స్‌లో ఎక్కువగా కనిపించాడు. కోర్ట్ సినిమా నచ్చకపోతే తన హిట్ 3 సినిమా చూడవద్దంటూ ఓపెన్ ఛాలెంజ్ చేసేంత నమ్మకంను ఆయన పెంచుకున్నాడు. ఆయన నమ్మకం వమ్ము కాలేదు. కొన్ని సినిమాలు విమర్శకుల ప్రశంసలు దక్కిం చుకుంటుంది.. కానీ వసూళ్లు అంతంత మాత్రమే రాబడుతాయి. కానీ కోర్ట్ సినిమా విమర్శకుల ప్రశంసలు దక్కించుకుని, మంచి మెసేజ్ ఉన్న సినిమా అని కామెంట్స్ దక్కించుకుంది. అంతే కాకుండా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సొంతం చేసుకుంది. చిత్ర యూనిట్ సభ్యులు తాజాగా కలెక్షన్స్ గురించి అధికారిక ప్రకటన చేశారు. ఇటీవలే ఈ సినిమా రూ.50 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను క్రాస్ చేసింది. వరల్డ్ బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్లకు మించి వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డ్ నమోదు చేసింది. అంతే కాకుండా యూఎస్ బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఏకంగా మిలియన్ డాలర్లను వసూళ్లు చేసింది. ఈమద్య కాలంలో పెద్ద హీరోల సినిమాలు కూడా యూఎస్‌లో మిలియన్ డాలర్లను వసూళ్లు చేసేందుకు కష్టపడుతున్నాయి. ఇలాంటి సమయంలో యూఎస్‌లో చిన్న సినిమా అయిన కోర్ట్‌కి మిలియన్ డాలర్ల వసూళ్లు నమోదు కావడం పెద్ద విషయం. చిన్న బడ్జెట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్ల వసూళ్లు రాబట్టడం అతి పెద్ద విషయం. ఆ అరుదైన రికార్డ్‌ను కోర్ట్ సినిమా దక్కించుకుంది. – తుపాకి.కామ్ సౌజన్యంతో...




# గోపీచంద్‌తో రితికా నాయక్



గోపీచంద్ కథానాయకుడిగా 'ఘాజీ' ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ చిత్రం రూపుదిద్దుకొంటోంది. శ్రీనివాస్ చిట్టూరి నిర్మాత. ఇటీవల లాంఛనంగా ప్రారంభమైంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలెడతారు. ఈ చిత్రంలో కథానాయికగా రితికా నాయక్‌ని ఎంచుకొన్నారు. నిన్ననే గోపీచంద్–రితికల మధ్య ఫొటోషూట్ జరిగింది. అధికారిక ప్రకటన రావాల్సివుంది. 'అశోకవనంలో అర్జున కల్యాణం' సినిమాతో ఆకట్టుకొంది రితిక. అయితే ఆ తరవాత ఆమెకు పెద్దగా అవకాశాలు రాలేదు. మొన్ననే వరుణ్ తేజ్ సినిమా 'కొరియన్ కనకరాజు'లో కథానాయికగా ఎంపికైంది. ఆ సినిమా ఇటీవలే పట్టాలెక్కింది. ఇంతలోనే గోపీచంద్ సినిమాలో ఛాన్స్ అందుకొంది. చారిత్రక నేపథ్యం ఉన్న కథ ఇది. 7వ శతాబ్దంలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారం గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# కాజల్ ఈ ఎక్స్‌ట్రా డోస్ అందుకేనా..?



హీరోయిన్స్‌కి పెళ్లైతే దాదాపు కెరీర్ క్లోజ్ అయినట్టే అన్నట్టుగా చెప్పుకుంటారు. ఐతే ఒకప్పుడు పరిస్థితి వేరు అసలు పెళ్లైన హీరోయిన్ ని సినిమాల్లో తీసుకోవాలంటేనే మేకర్స్ ఆలోచించేవారు కానీ పెళ్లికి హీరోయిన్ యాక్టింగ్‌కి సంబంధం లేదు అని తెలుసుకునే సరికి చాలా టైం పట్టింది. అంతేకాదు హీరోయిన్స్ పెళ్లికి ముందు ఎంత రెచ్చిపోయినా కూడా పెళ్లైతే మాత్రం సినిమాలకు బైబై చెప్పడం లేదంటే ఒకటి అరా చేసినా కూడా పద్ధతిగా కనిపించే పాత్రలే చేసే వారు. ఐతే కాలం మారింది ఇప్పుడు పెళ్లైన హీరోయిన్స్ కూడా స్టార్ ఛాన్స్‌లు అందుకుంటున్నారు. పెళ్లి కాకముందు ఎలా గ్లామర్ షో చేశారో ఆఫ్టర్ మ్యారేజ్ మరింత రెచ్చిపోతున్నారు. దీనికి కారణం సినిమాలు అలవాటైన వాళ్లు ఆఫ్టర్ మ్యారేజ్ మళ్లీ ఏదో కొత్త పని చేయలేరు. అందుకే మళ్లీ సినిమా ప్రయత్నాలు చేస్తారు. ఐతే పెళ్లైనా కూడా కొందరి భామల్లో పెద్దగా మార్పు రాదు. అలాంటి వారికి మళ్లీ వరుస ఛాన్స్‌లు వస్తుంటాయి. ఐతే పెళ్లై ఒక బేబీకి తల్లైన తర్వాత కూడా కొంతమంది భామలు అదరగొట్టేస్తుంటారు. అలాంటి వారిలో కాజల్ అగర్వాల్ ఉంటుంది. ఆచార్య టైంలో పెళ్లి చేసుకున్న అమ్మడు త్వరగానే ఒక బాబుకి జన్మనిచ్చింది. ఐతే పెళ్లైనా తను సినిమాలు చేసేందుకు అభ్యంతరం ఏమి లేదని చెబుతూ వచ్చింది కానీ ఆఫ్టర్ మ్యారేజ్ కాజల్‌లో మార్పులు కనిపించాయి. అయినా సరే తన ప్రయత్నాలు తాను చేస్తూ వచ్చింది. ముఖ్యంగా తెలుగులో భగవంత్ కేసరి, సత్యభామ, ఇండియన్ 2 సినిమాల్లో కాజల్ మెరిసింది. ఐతే ఆ సినిమాలేవి ఆమెకు పెద్దగా ఉపయోగపడలేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో సల్మాన్ సికందర్‌లో కాజల్ నటించింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో కాజల్ యాక్టివ్‌గా ఉంటుంది. రీసెంట్‌గా జరిగిన సికందర్ ఈవెంట్‌లో కాల జిగేల్ అనిపించే గ్లామర్ షో చేసింది. సౌత్‌స్టార్‌గా ఉన్నప్పుడు కూడా కాజల్ ఇలా రెచ్చిపోయింది లేదు. కానీ ఎలాగైనా కెరీర్‌ని మళ్లీ గాడిన పడేసుకోవాలనే ఆలోచనతో కాజల్ ఇలా చేస్తుందనిపిస్తుంది. కాజల్ గ్లామర్ షో ఆమె ఫ్యాన్స్‌కి ఫుల్ ట్రీట్ ఇచ్చింది. సికందర్ కోసం కాజల్ చేసిన ఈ అటెంప్ట్ ఏదైతే ఉందో అక్కడ ఏమో కానీ కాజల్‌ని ఇష్టపడే తెలుగు ఫ్యాన్స్‌ని అలరించింది. అమ్మడికి తెలుగులో మంచి సినిమాలు పడితే మళ్లీ మునుపటి ఫాంని కొనసాగిస్తుందని కాజల్ ఫ్యాన్స్ భావిస్తున్నారు. – తుపాకి.కామ్ సౌజన్యంతో...




ఇండియన్ ప్రీమియర్ లీగ్ మొదలవగానే మళ్లీ అందరి చూపు ఎంఎస్ ధోనీ వైపు మళ్లింది. 2020లోనే అంతర్జాతీయ ఆట నుంచి రిటైరైనప్ప టికీ ధోనీకి ఇప్పటికీ 'సూపర్ స్టార్' హెూదా ఉంది. ప్రపం చంలోనే అత్యంత ధనిక క్రికెట్ లీగ్‌గా పేరున్న ఐపీఎల్‌లో ధోనీ కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ధోనీతో పాటు లీగ్‌లో అనుభవజ్ఞు లైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా.. వర్ధ మానస్టార్లు శుభ్‌మన్‌గిల్, యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ ఆడుతున్నా రు. గత 9 నెలల్లో రెండు ఐసీసీ టైటిళ్లను సాధించిన భారత జట్టులో వీరంతా సభ్యులు. టీమిండియా గతేడాది జూన్‌లో టీ20 వరల్డ్ కప్‌తో పాటు, ఇటీవల చాంపియన్స్ ట్రోఫీని సాధించింది. అయిన ప్పటికీ ధోనీ నాయకత్వ లక్షణాలు, లీగ్‌లో అతని ఉనికి అభిమానుల ను ఎంతగానో ఆకర్షిస్తూనే ఉంది.

(క్రికెట్ రచయిత, అయాజ్ మెమన్)

# ఎం.ఎస్.ధోనీ.. ఎందుకంత క్రేజ్!!

ధోనీకి ఈ ఏడాది జులైలో 44 ఏళ్లు నిండనున్నాయి. ధోనీ వరుసగా 18 సీజన్లుగా ఐపీఎల్ ఆడుతున్నాడు. ఇందులో 16 సీజన్లు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ ఏడాది టోర్నీలో అతిపెద్ద వయస్కుడు ధోనీ. అయితే, ఐపీఎల్ ఆడిన అత్యంత పెద్ద వయస్కుడిగా ఆస్ట్రేలియా స్పిన్నర్ బ్రాడ్ హాగ్ రికార్డు సృష్టించాడు. 45 ఏళ్ల 92 రోజుల వయస్సులో, 2016 ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున బ్రాడ్ హాగ్ ఆడాడు.

లెగ్ స్పిన్నర్ ప్రవీణ్ తాంబే ప్రస్థానం మరోలా ఉంది. 41 ఏళ్ల 212 రోజుల వయస్సులో తాంబే, ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేశాడు. 2019లో 44 ఏళ్ల 219 రోజుల వయస్సులో తన చివరి మ్యాచ్ ఆడాడు. తాంబే, హాగ్‌లను ధోనీ అధిగమిస్తాడా? లేదా? అనేది చూడాలి.

2025 సీజన్ కోసం ధోనీని అట్టిపెట్టుకునేందుకు ఐపీఎల్ మెగా వేలంలో సీఎస్కే జట్టు రీటెన్షన్ నిబంధనను వాడుకుంది. అన్‌క్యాప్డ్ ప్లేయర్ కోటాలో ధోనీని రీటెయిన్ చేసుకుంది. 18 ఐపీఎల్ సీజన్లలో ధోనీ 5,243 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో ప్రస్తుతం అత్యధిక పరుగులు చేసిన జాబితాలో కోహ్లీ అగ్రస్థానంలో నిలవగా, ధోనీ ఆరో స్థానంలో ఉన్నాడు. లీగ్‌లో 5,000కు పైగా పరుగులు చేసిన ప్లేయర్లలో రోహిత్ శర్మ, కోహ్లీ కంటే ధోనీ బ్యాటింగ్ సగటు (39.12) ఎక్కువ. డేవిడ్ వార్నర్ (40.52), ఏబీ డివిలియర్స్ (39.70) కంటే తక్కువ. 5,000 పరుగులు చేసిన ప్లేయర్లలో స్ట్రయిక్ రేట్ పరంగా చూస్తే డివిలియర్స్ (151.68), వార్నర్ (139.77) తర్వాత ధోనీ (137.53) మెరుగైన స్థానంలో ఉన్నాడు. ధోనీ లీగ్‌లో 252 సిక్సర్లు బాదాడు. అతని కంటే గేల్ (357), శర్మ (280), కోహ్లీ (272) ముందున్నారు. ఈ బ్యాటింగ్ గణాంకాలన్నీ ధోనీ ప్రతిభలోని ఒక కోణాన్ని మాత్రమే ఆవిష్కరిస్తాయి.

వికెట్ కీపర్‌గా ఎవరికీ సాధ్యం కాని రికార్డును ధోనీ నెలకొల్పాడు. ఓవరాల్‌గా 180కి పైగా అవుట్‌లలో ధోనీ కీలక పాత్ర పోషించాడు. భారత మాజీ కోచ్ రవి శాస్త్రి, ధోనీ వేగంగా స్పందించే తీరు, తెలివైన కీపింగ్ నైపుణ్యాల కారణంగా అతనికి 'పిక్ పాకెట్' అనే ముద్దుపేరు ఇచ్చాడు. 'హెలికాప్టర్ షాట్' అతని బ్యాటింగ్ ప్రతిభకు సిగ్నేచర్ స్ట్రోక్‌లా మారింది. ధోనీ బ్యాటింగ్‌లో మరో ముఖ్యమైన అంశం మ్యాచ్‌ను నియంత్రించగల అతని సామర్థ్యం. ఇన్నింగ్స్‌ను చివరి వరకు తీసుకెళ్లడం, ఉత్కంఠ సమయాల్లో మ్యాచ్‌పై అసాధారణ నియంత్రణ కలిగి ఉండటం, చివర్లో విస్ఫోటక స్ట్రోక్‌లతో విరుచుకుపడటం ధోనీకి ఉన్న సామర్థ్యాలు. అలాగే వికెట్ల మధ్య కూడా వేగంగా పరిగెత్తడం మరో అంశం. ఈ లక్షణాలన్నీ అతన్ని మ్యాచ్ విన్నర్‌గా నిలబెట్టాయి.

ఐపీఎల్‌లో ఎక్కువ మ్యాచ్‌లకు కెప్టెన్‌గా (210) వ్యవహరించిన, ఎక్కువ విజయాలు (123) సాధించిన కెప్టెన్‌గా ధోనీకి రికార్డు ఉంది. సీఎస్కేకు అయిదుసార్లు టైటిల్ అందించాడు. చాంపియన్స్ లీగ్ టైటిళ్లు కూడా సాధించాడు. ధోనీ కెప్టెన్సీలో టీమిండియా మూడు ఐసీసీ టైటిళ్లను గెలుచుకుంది. టీ-20 వరల్డ్‌కప్ (2007), వన్డే వరల్డ్ కప్ (2011), చాంపియన్స్ ట్రోఫీ (2013)లలో భారత్ విజేతగా నిలిచింది. టెస్టు క్రికెట్‌లో కూడా ధోనీ తనదైన ముద్ర వేశాడు. 90 టెస్టులు ఆడిన ధోనీ, ఐసీసీ ర్యాంకింగ్‌లో భారత్‌ను నెంబర్‌వన్‌గా నిలిపాడు. 2014-15 సిరీస్ మధ్యలో అకస్మాత్తుగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత మాజీ కెప్టెన్లు సునీల్ గావస్కర్, శాస్త్రి తరచుగా భారత అత్యుత్తమ క్రికెటర్ అంటూ ధోనీని ప్రశంసించారు.

**ప్రస్తుత సీజన్‌లో ధోనీపరిస్థితి ఏంటి?**

వయస్సు పెరగడం తప్పితే ధోనీ మానసికంగా చాలా దృఢంగా ఉన్నాడు. గట్టి పోటీదారు. ఐపీఎల్ ప్రారంభం నుంచి ఫినిషర్ పాత్ర పోషించిన ధోనీ, గత సీజన్‌లో ఈ బాధ్యతకు దూరంగా ఉన్నాడు. అతిథి పాత్రలా చివర్లో విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. ఐపీఎల్‌లో ఇప్పుడు భాగమైన ఇంపాక్ట్ ప్లేయర్ పాత్రలో ధోనీ స్థిరపడొచ్చు. అదేవిధంగా జట్టుకు అనధికార మెంటార్, కెప్టెన్ పాత్రలోనూ కొనసాగవచ్చు.




సీఎస్కేకు జట్టులో ప్లేయర్‌గా ధోనీ పాత్ర చాలా చిన్న విషయం. కానీ, అతని ఆకర్షణ ఆ ఫ్రాంచైజీకి, ఐపీఎల్‌కు భారీ వాణిజ్య, బ్రాండింగ్ ప్రయోజనాలను అందిస్తుంది. ధోనీ లేకుండా ఐపీఎల్‌ను ఊహించుకోలేమని సీఎస్కే యాజమాన్యం చెబుతుంటుంది. ఇలా చేయడం వల్ల దేశీ, విదేశీ యువ ప్లేయర్ల అవకాశాలు పరిమితం అవ్వొచ్చనే వాదనను రవిశాస్త్రి తోసిపుచ్చారు. "స్వేచ్ఛా మార్కెట్ డైనమిక్స్‌పై ఐపీఎల్ పనిచేస్తుంది. ఫ్రాంచైజీ యజమానులు భావోద్వేగాలతో పనిచేయరు. మైదానం లోపల, బయట వాళ్లకు ఏది ఉత్తమమైనదో తెలుసు" అని రవిశాస్త్రి వ్యాఖ్యానించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తాం

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఇల్లు లేని ప్రతి ఒక్కరికి పక్కా గృహం మంజూరు చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేపడుతున్న గృహ నిర్మాణ పనులపై ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులు వేగవంతం కావాలన్నారు. నిర్మాణ పనుల్లో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఇల్లు కలిగి ఉండాలని, అదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. పీఎంఏవై అర్బన్, పీఎంఏవై గ్రామీణ పథకాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు సాయం కింద నిర్మాణంలో ఉన్న గృహాలకు రూ.50వేలు, 75వేలు, రూ.లక్ష అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. డిమాండ్ సర్వే ఎంట్రీ ఈ నెలాఖరుతో ముగుస్తున్నందున అర్హులైన లబ్ధిదారులందరూ ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సర్వే వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.



## ప్రజా సమస్యలపై తక్షణమే పరిష్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చున్నారు. తక్షణమే చర్యలకు ఆదేశాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు.



## శ్రీకాకుళం జిల్లాలో కెమికల్ ఇంజినీర్లకు ఎక్కువ డిమాండ్

**- ఫార్మా సంస్థలకు ఈ నైపుణ్య వనరుల కొరత ఉంది**

**- జిల్లా తలసరి ఆదాయం పెంపు దిశగా చర్యలు తీసుకుంటున్నాం**

**- ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఏఐ టూల్స్‌పై శిక్షణ - కలెక్టర్ స్వప్నిల్ దినకర్**






(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లాలో కెమికల్ ఇంజినీర్లకు విపరీతమైన డిమాండు ఉందని కలెక్టరు స్వప్నిల్ దినకర్ తెలిపారు. ఫార్మారంగంలో జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కలెక్టర్ల సదస్సులో ఆయన తన జిల్లా ప్రగతి గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో ఫార్మాసంస్థల నుంచి కెమికల్ ఇంజినీర్లకు డిమాండు ఎక్కువగా ఉందని తెలిపా రు. పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే కెమికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా కోర్సులు ప్రారంభించా మన్నారు. తలసరి ఆదాయంలో శ్రీకాకుళం జిల్లా లో తలసరి ఆదాయం పెంచేదిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో తలసరి ఆదాయం రూ.1.85 లక్షలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో రైతులు కేవ లం వరి పంట మాత్రమే ప్రధా నంగా సాగు చేస్తున్నారన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుదిశగా కూడా ప్రోత్సహించనున్నామన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగంలో శ్రీకాకుళం జిల్లాలో ప్రగతి సాధించడానికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోబోతున్నట్లు తెలిపారు. జిల్లాలో అరసవల్లి, శ్రీకూర్మం పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలుగా ఉన్నాయన్నారు. పర్యాటకపరంగా కూడా జిల్లాను అభివృద్ధి చేయనున్నామన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ కూడా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టూల్స్ ఉపయోగించడంపై ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి 200మంది ఉద్యోగులకు ఈ శిక్షణ అందించనున్నామన్నారు.

లైంగిక నేరాల నుంచి చిన్నారులకు

## రక్షణ కల్పించే చట్టమే పోక్సో

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చిన్నారులను తప్పుదోవ పట్టించి మనతో నటిస్తూ శ్రేయోభిలాషులుగా బంధువులుగా పరిచయస్తులుగా సన్నిహితులుగా ఉంటూ దుర్మార్గానికి చెడు చేష్టలకి దారి తీస్తున్నారని ఒకటవ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి, పి భాస్కరరావు తెలిపారు. స్థానిక శాంతినగర్ కాలనీ 4వ లైన్‌లో గల ట్రైబల్ హాస్టల్‌లో పిల్లలపై లైంగిక వేధింపుల చట్టంపై న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు ప్రస్తుత సమాజంలో పిల్లల పట్ల అనేక నేరాలు జరుగుతున్నాయని, కొందరు అశ్లీల ప్రయోజనాల కోసం పిల్లలను ఉపయోగించడం, పిల్లలకి అశ్లీల విషయాలను చూపడం వంటివి చేసి వారిని లోబరుచుకొని సెక్స్‌కి బానిసలుగా చేయడం చేస్తున్నారన్నారు. వీటివలన వారు సాధించాల్సిన ఉన్నత శిఖరాలను కోల్పోతున్నారని తెలిపారు. పిల్లలకు సంబంధించిన అశ్లీల చిత్రాలను చూసిన దగ్గర ఉంచుకున్న ఇంకొకరికి పంపించినా, ఇటువంటి చిత్రాలు వారి వద్దనే ఉంచుకున్న పోక్సో చట్టం కింద వస్తుందని తెలిపారు. ఇటువంటి వారికి కఠిన శిక్షలు ఉన్నాయని వీటి జోలికి వెళ్లకుండా ఉండాలని సూచన ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, ఎ.రాజారావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్ అప్పలస్వామి, జి కృష్ణమూర్తి, బీసీ హాస్టల్, ఎస్సీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.






రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదినం సందర్భంగా జిల్లా ట్రెజరీ హెల్పింగ్ హాండ్స్ కార్యదర్శి, ఎన్టీఆర్ ఎంఎస్ఎస్ అధ్యక్షుడు మాదారపు దేవిడ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించిన దృశ్యం - సత్యంన్యూస్, శ్రీకాకుళం

VIDWATH IIT & NEET ACADEMY
డోర్ నెం: 16-11-45, విజయ ఆదిత్య పార్క్ ఎదురుగా, సనపలవానిపేట, NH-16 ప్రక్కన, శ్రీకాకుళం.
8074580974, 8328383043, 91826 49534, 6361448622
తల్లి దండ్రులు, విద్యార్థుల కలల సాకారానికి ఒక విశ్వసనీయ భాగస్వామి - విద్వత్ మన శ్రీకాకుళంలో
ADMISSIONS OPEN 2025 - 26
STRESS FREE EDUCATION IN A STUDENT FRIENDLY ENVIRONMENT
Girls Campus Siri Bhavan
Boys Campus Medha Bhavan
బెంగుళూరు, చెన్నై, కోట, కోయంబత్తూర్
ఈ నగరాలలోని ప్రసిద్ధ సంస్థలలో పనిచేసిన "Expert Faculty" చే నిరంతర శిక్షణ
Maths Madhu Sir
Physics Naresh Sir
Chemistry Prasad Sir
Botany Eswar Prasad Sir
Zoology Praveen Sir


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT: 9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739


Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001










Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.